

ప్రతాప వెంకట సుబ్బారాయుడు
9393981918

కథ

# పతియే ప్రత్యక్షదైవమే..!

"అలివేలూ..అలివేలూ.."

"ఊఁ..."నిద్రలో ఒక పక్కకి తిరుగుతూ విసుగు ధ్వనింపజేసింది.

"నీ కోసం వేడి వేడీ కాఫీ కలిపి తీసికొచ్చాను.తాగి పడుకోవచ్చుగా!.."


"అబ్బా!... కాస్తాగి తేవచ్చుగా! పెళ్ళాం మీద ప్రేమ కారి పోతు న్నట్టు మాంఛి నిద్రపోతుంటే లేపివ్వాలా?!" అని చిరాగ్గా లేచి మొగుడి చేతిలోని గ్లాసందుకుని రెండు మూడు గుక్కల్లో తాగి మళ్ళీ పడుకుంది.

'నా భార్య నన్నూ... నా ప్రేమనూ... ఎప్పుడు అర్థం చేసుకుంటుందో' మనసులో నిరాశగా గొణుక్కుని వంటింట్లోకెళ్ళి ఇడ్లీలు చేయడానికి సన్నాహం చేయసాగాడు... అదీ, భార్య ఎక్కడ లేస్తుందో...అని చప్పుడు చేయకుండా.

అంతలో ఎదురుగా వున్న దేవుళ్ల అర లోని శ్రీకృష్ణుడి ఫోటోలోంచి నవ్వు విని పించింది.

ముందు భ్రమేమో అనుకున్నాడు. కానీ ఆ ఫోటోలో అంతర్లీనంగా శ్రీకృష్ణుడు కని పించేసరికి పద్యాలూ, శ్లోకాలు రావు గనక తన్మయత్వంతో 'చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ' పాడి ఆనందభాష్పాలు రాల్చాడు.

''అందుకేనయ్యా బాబూరావు... నువ్వంటే నాకు అమిత ఇష్టం. కాన్వెంట్ చదువులతో ఒక్క తెలుగుముక్కరాని ఈ తరంలో నువ్వో గొప్ప ఆణిముత్యానివ య్యా! చక్కటి పద్యంతో నన్ను స్తుతించి నా మార్కులు కొట్టేసావు...అంతేకాదు చిన్న ప్పటి నుండీ రోజూ పొద్దున్నే ఒకపువ్వు నా ముందేసి... నుదుటన కుంకం బొట్టు




పెట్టుకుని సాత్వికమైన జీవితం గడుపుతు న్నావు. ఈనాటి భక్తుల్లో నీదే అగ్రస్థానం." అన్నాడు ఫోటోలోంచి చల్లని వెన్నెల చిరు నవ్వులు చిందిస్తూ.

"ధన్యుడినయ్యాను స్వామీ! ఇంతకీ ఈ భక్తుడి మీద మీకు అభిమానం కలగడానికి కారణం?"

"చెబుతానయ్యు... పదహారువేలమంది గోపికలు, రుక్మిణి, రాధల...రాసలీలలతో నేనెంత పేరు పొందినా... సత్యభామ నా తలమీద తన్నిన ఘట్టం కమ్మని పాయసం లో ఓ ఉప్పురాయిలా తోచి మనసుని కలచి వేస్తుందయ్యా... మగాళ్ళపట్ల ఈ ఆడాళ్ళ దాష్టీకానికి అంతుండడం లేదు! వాళ్ళ పట్ల మనం చూపిస్తున్న అభిమానాన్ని అర్థం చేసుకోకుండా... చేతకానితనం అనుకుని నెత్తికెక్కి పిండి కొడతారు... పాపం! పెళ్ళై నప్పటినుండీ నీ భార్య నిన్ను ఎంత హింసి స్తోందో ఫోటోలోంచి చూస్తున్నాను... అందుకే నీకోసం... నా భక్తుడిని కాపాడుకో వడం కోసం వచ్చాను."

"అవునా స్వామీ!... నేనెంత అదృష్ట వంతుణ్ని. నా కష్టాలు కడతేర్చడానికి సాక్షా త్తు శ్రీకృష్ణ భగవానుడే వచ్చాడు."

"ఇవాల్టినుండీ నీకు నా శక్తులు కొన్ని ధారబోస్తున్నాను. దాంతో నువ్వూ దేవుడవ వుతావన్నమాట. మీ ఆవిడకి పతిదేవుడివి. నిన్ను నవవిధ భక్తులతో ఎంత పూజిస్తే అంతగా ఆవిడ వశమవుతావు. నీ మహి మలు చూసి మీ ఆవిడ నిన్ను అపురూపం గా...ప్రేమగా... లాలనగా చూసుకుం టుంది. సరేనా?..."అన్నాడు.

"ఆహా! నాదేమి భాగ్యము స్వామీ... నువ్వు నిజంగా కరుణా సముద్రుడవే... భక్తసులభుడవే... లేకపోతే ఇలాంటి అయా చిత వరం ఇంటికొచ్చి మరీ ఇస్తావా?!" అన్నాడు సంతోషాతిరేకంతో ఉప్పొంగి పోతూ.

"ఇహ పొగడ్డం ఆపి...నేను చెప్పేది జాగ్రత్తగా విను!" అని అతని చెవిలో ఏదో చెప్పి మాయమయిపోయాడు.

✦ ✦ ✦

సరదా పెళ్ళి సామెతలు

సన్యాసి సుఖీ - సంసారి దుఃఖీ - సన్యాసికి బెత్తెడు గోచీ, సంసారికి చీరల పేచీ !

బాబూరావు చిన్నగా బెడ్రూమ్ లోకెళ్ళి–

"అలివేలూ... అలివేలూ..." మందంగా వేణువూదినంత మధురంగా పిలిచాడు.

ఆమె కళ్ళు తెరిచి భర్తని చూసి ఆశ్చర్య పోయింది.

కారణం బాబూరావు ముఖంలో దివ్య మైన చల్లని వెన్నెల కాంతి, అతని తల వెనకాల న్యూటన్‌వర్ణచక్రం చిన్నగా తిరుగు తోంది.

"మీకేమైందండీ?... అదోరకంగా... వింతగా వున్నారేమిటి?" ఆశ్చర్యపోయింది.

"నేను చెప్పేది శ్రద్ధగా విను అలివేలూ... ఇవాళ్టి నుండీ దేవుడినయ్యాను... నీ పతి దేవుడిని! నన్ను నువ్వు ఎంతగా పూజిస్తే నేను నీకు అంత దగ్గరై నిన్ను సుఖ పెడ తాను" అన్నాడు అర్ధనిమీళిత నేత్రాలతో.

"నేను నమ్మను!" అంది.

"అయితే చక్కగా స్నానం చేసి... మంచి దుస్తులు ధరించి... చెంబుతో నీళ్ళు తీసు కొచ్చి నా కాళ్ళు కడిగి... మెత్తటి గుడ్డతో తుడు! నువ్వే చూద్దువు గాని ఏం జరుగు తుందో" అన్నాడు.

ఆమె సందిగ్ధ మనస్సుతో లోపలికెళ్ళి అరగంటలో రాగి చెంబుతో నీళ్ళు తెచ్చి శ్రద్ధగా బాబూరావు పాదాలు కడిగి, టర్కీ టవల్‌తో మెత్తగా తుడిచి రెండు పూలు కూడా వేసింది.

సంతుష్టుడైన బాబూరావు– "భక్త భార్యా! నీ భక్తికి కొంత సంతసించాను. నీకు ఎప్ప ట్నుండో నెమలి పింఛం రంగు పట్టుచీర అడుగుతున్నావు కదా!... ఇదిగో..." అని అప్పటికప్పుడు చేతులతో పట్టుచీర సృష్టించి ఆమెకిచ్చాడు.

ఆమెకి ఆశ్చర్యంతో మతిపోయింది.

మధ్యతరగతి జీవితం గడుపుతూ రూపా యి ఖర్చు పెట్టడానికి అల్లల్లాడిపోయే తన భర్త, పట్టుచీర తేలిగ్గా సృష్టించి ఇచ్చేశాడు.

రోజూ తనచేత దొబ్బులు తినే బాబూ రావుకి ఆ శక్తులెలా వచ్చాయి? కొంపదీసి నిజంగానే దేవుడయిపోయాడా... ఏమిటి?

"నాకు మరో పట్టుచీర ఇవ్వండి" అంది.

"అది నా చేతుల్లో లేదు అలివేలూ! నీ మీదే ఆధార పడివుంది. నువ్వు నన్ను ఎంత గొప్పగా పూజిస్తే... ఆరాధిస్తే అంతకంత నీకు లభిస్తుంది."

"పూజించడం అంటే ఎలా?"

"దేవుళ్ళని పూజించవూ... అలాగే! నాతో సౌమ్యంగా మాట్లాడాలి... ఇంటిపనులు శ్రద్ధగా... ఆసక్తిగా చేయాలి. నేనేదడిగినా విసుక్కోకుండా, కసురుకోకుండా చెయ్యాలి. ముఖ్యంగా కార్తీక మాసంలో పదిహేను రోజులపాటు నియమ నిష్ఠలతో పతిభక్తి వ్రతం చేయాలి... ఇలా చేస్తూ పోతే ఇహలోకంలో నువ్వు సుఖపడతావు. పైలోక స్వర్గంలో నీకో బెర్తు నేను రిజర్వ్ చేసి ముక్తి




పడుచు పెళ్ళాం వడ్డిస్తోందంటే – వేడి వేడి పకోడీలు తిందామా అన్నాడట.

నొందేలా చేస్తాను. అలా పుణిస్త్రీగా ఎవ్వరికీ దక్కని అదృష్ట ఫలం నీ సొంతమవుతుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... ఈ విషయం నువ్వు పొరబాటున కూడా ఎవ్వరికీ చెప్పకూడదు! చెప్పావో నాలోని దైవశక్తులు మటుమాయమై మనం సాధారణ దంపతుల మవుతాం" అన్నాడు.

"మిమ్మల్ని పువ్వుల్లోపెట్టి చూసుకోనూ, ఇప్పటిదాకా ఎంత బాధ పెట్టానండీ పాపిష్ఠి దాన్ని... అయ్యో!... ఇందాకటినుండీ మిమ్మల్ని నుంచోబెట్టే మాట్లాడుతున్నాను... ఇలా కూర్చోండి" అని పడక్కుర్చీ తెచ్చి వేసింది.

బాబూరావు కృష్ణుడి ఫోటో వంక చూశాడు. అందులోంచి చిరునవ్వులు చిందిస్తున్నాడు మురారి.

అలివేలు పూర్తిగా మారిపోయింది.

అహర్నిశలూ భర్త సేవలో తలమునకలవుతోంది. ఆమె హృదయంలో సాత్వికత చోటుచేసుకుంది... మాటల్లో లాలిత్యం తొంగి చూస్తోంది.

అప్పుడప్పుడు భర్తవద్దనుండీ ముక్కుపుడక... గొలుసులాంటి వరాలందుకుంటోంది. ఎప్పటికైనా ఓ పెద్ద బంగ్లా... నడుముకి వడ్డాణం, మెళ్ళో డైమండ్ నెక్లెస్ తన భక్తితో సంపాదించాలని ఉవ్విళ్ళూరుతోంది. భర్తకి తెగపూజలూ, సేవలూ చేసేస్తోంది. వాళ్ళిద్దరూ ఎంతో అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు.

కలయో, వైష్ణవ మాయయో తెలియని అయోమయంలో ఉన్నాడు బాబూరావు. మొత్తానికి జరిగిన మంచికి ఆనందతాండవం చేస్తున్నాడు.

ఆ రకంగా శ్రీకృష్ణపరమాత్ముడి దయవల్ల వాళ్ళిద్దరూ అన్యోన్యంగా, చిలకాగోరింకల్లా వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని చవిచూస్తున్నారు.

(పాఠకులూ మీరు ఇది నమ్మరా? వినాయకుడు పాలు తాగాడంటేను, బాబాలు వస్తువులు సృష్టించారంటేనూ నమ్ముతారు కాని ఇది నమ్మరా? నమ్మండి బాబూ... నవ్వండి)

సర్వే దంపతా సుఖినోభవంతు!

